క్లుప్తంగా

వార్డు అభివృద్ధికి నిధులు ఇవ్వండి

మంత్రి సబితను కోరిన కౌన్సిలర్



మంత్రి సబితకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆ వార్డు కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ మంగళవారం మంత్రి సబితారెడ్డిని కోరారు. మంగళవారం నగరంలోని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు అభివృద్ధికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ యువజన నాయకులు శ్యామెల్ రాజు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. సామూహిక సత్యానారాయణ వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ పాలకమండలి సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

సీఎం కప్-2023పై అవగాహన



సమావేశమైన ప్రజాప్రతినిధులు, అధికారులు

కందుకూరు: మండల స్థాయిలో యువతీయువకులకు నిర్వహించనున్న సీఎం కప్-2023 క్రీడా పోటీలకు సంబంధించి మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకట్రాములు, సీఐ కృష్ణంరాజు, ఎంఈఓ కృష్ణయ్య, ఎంపీఓ విజయలక్ష్మి అవగాహన కల్పించారు. యువతీయువకులకు పరుగు పందెం 100 మీటర్లు, 400 మీటర్లు, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు.. కేవలం యువకులకు ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 11వ తేదీ(గురువారం) వరకు ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శుల వద్ద వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా షర్ఫుద్దీన్



షర్ఫుద్దీన్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: బీఆర్‌ఎస్ జల్‌పల్లి మున్సిపల్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మహ్మద్ షర్ఫుద్దీన్ నియమితులయ్యారు. మంగళవారం మంత్రి సబితారెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా షర్ఫుద్దీన్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు మంత్రి సబితారెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కైసర్ బామ్, సయ్యద్ అబ్దుల్ రవూఫ్, కొండల్ యాదవ్, యంజాల అర్జున్, అఫ్జల్, నగేష్ ముదిరాజ్, షాకీర్, అంజద్ పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌కు తరలిరండి: బీజేపీ

మీర్‌పేట: బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డిలో చేపట్టనున్న నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని మీర్‌పేట 33వ డివిజన్ కార్పొరేటర్ భీంరాజ్ కోరారు. మంగళవారం ఆయన మీర్‌పేటలో మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేపట్టకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రశ్న పత్రాల లీకేజీలతో నష్టపోయిన నిరుద్యోగులకు ప్రభుత్వం రూ.లక్ష పరిహారం ఇవ్వాలన్నారు. నిరుద్యోగ మార్చ్‌కు యువత పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

సత్తాచాటిన ప్రభుత్వ విద్యార్థులు


మానస, (978)


మహేశ్వరి, (974)


మానస, (974)


పూజిత, (963)


మీనాక్షి, (956)


నవ్య, (954)


శివాని, (954)


మణిదీప్, (954)


శ్రీవల్లి , (943)


వినయ్, (936)


అనుష, (931)


సుష్మిత, (924)


స్వాతి, (453)


శ్రుతి, (448)


సృజన, (439)


కార్తీక్, (427)


స్వాతి, (397)


పవిత్ర, (406)


సేవేంద్రచారి, (449)


బ్లెస్సీ, (382)

మహేశ్వరం: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల్లో మహేశ్వరం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. 207 మంది పరీక్షా రాయగా 129 మంది ఉత్తీర్ణులయ్యారు. 62.35 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్‌లో 218 మంది మంది పరీక్ష రాయగా 180 మంది ఉత్తీర్ణులై 78.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీ గ్రూపులో మానస(974), బైపీసీ గ్రూపులో అనూష(931), సీఈసీలో శ్రీవల్లి (943), హెచ్ఈసీలో దీపిక(866) మార్కులు సాధించి సత్తా చాటారు.ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీలో సురేష్(370), బైపీసీలో బ్లెస్సీ(382), సీఈసీలో (397) మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి, అధ్యాపకులు అభినందించారు.

మహేశ్వరం మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో..

ఇంటర్మీడియట్ ఫలితాల్లో మహేశ్వరం ప్రభుత్వ మోడల్ స్కూల్-జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఫస్ట్ ఇయర్‌లో 111 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 46 మంది ఉత్తీర్ణులై 41 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 123 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 75 మంది ఉత్తీర్ణులై, 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో గ్రూపులో సృజన (439), బైపీసీలో పవిత్ర (406), ఎంఈసీలో స్వప్న (411)మార్కులు సాధించి సత్తాచాటారు. ఇంటర్ సెకండియర్‌లో ఎంపీసీ గ్రూపులో వినయ్ (936), బైపీసీలో హిందుశ్రీ (911), ఎంఈసీలో మణిదీప్ (954), సీఈసీలో మీనాక్షి (956) మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ అభినందించారు.

కందుకూరు మండలంలో..

కందుకూరు: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్, మోడల్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎస్ మానస 978 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో నేదునూరు మోడల్ స్కూల్ విద్యార్థులు కె.పూజిత 963, ఎన్.నవ్య 952 మార్కులతో, ప్రభుత్వ కళాశాల విద్యార్థిని కె.అక్షిత 928 మార్కులతో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. బైపీసీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని టి.మహేశ్వరి 974 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, మోడల్ విద్యార్థులు కె.శివాని 954, కె.శ్రుతి 952, టి.అంజలి 945 మార్కులు, ప్రభుత్వ కళాశాల విద్యార్థిని బి.వైష్ణవి 941 మార్కులు, మోడల్ స్కూల్ విద్యార్థులు యు.నవ్య 934, కె.వాసవి 920, కె.సింధూజ 913 మార్కులు సాధించారు. సీఈసీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు డి.సుష్మిత 929, టి.నందిని 900 మార్కులు, మోడల్ స్కూల్ విద్యార్థిని సయ్యద్ ఆసిఫ్ 829 మార్కులు సాధించాడు. మొదటి ఏడాది ఎంపీసీలో మోడల్ స్కూల్ విద్యార్థిని ఎ.శ్రుతి 448 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎ.మానస 407, బి.శ్రుతి 401, ఖైతూన్‌బేగం 400, బైపీసీలో కె.కార్తీక్ 427, బి.హర్షిత్ 410, ఎస్.అఖిల 400, సీఈసీలో డి.స్వాతి 453, గణేష్ 411, బి.శ్వేత 404 మార్కులు సాధించారు. కాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 75శాతం, ద్వితీయ సంవత్సరం 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. మోడల్ స్కూల్‌లో ద్వితీయ సంవత్సరం 60 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు.

మీర్‌పేట జూనియర్ కళాశాలలో..

మీర్‌పేట: మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో మీర్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరంలో 22 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొదటి సంవత్సరంలో సీఈసీ, బైపీసీ, ఎంపీసీ నుంచి మొత్తం 120 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 24 మంది, వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి 29 మంది పరీక్ష రాయగా 10 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ (మొదటి సంవత్సరం)లో జీ.సేవేంద్రచారి 470 మార్కులకు గాను 449 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ జీ.సైదులు తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబరులో ఆలస్యంగా తరగతులు మొదలు కావడం, కామర్స్ లెక్చరర్ లేకపోవడంతో ఉత్తీర్ణత శాతం తగ్గిందని, ఒక్క కామర్స్ సబ్జెక్టులోనే ఎక్కువగా విద్యార్థులు ఫెయిల్ అయ్యారని ఆయన వివరించారు.

బీఆర్‌ఎస్‌కు అండగా ఉంటాం



సమావేశమైన బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

బడంగ్‌పేట బ్రాహ్మణ సేవా సమితి

రంగారెడ్డి జిల్లా: రెండు దశాబ్దాలుగా పోరాడుతున్న తమ కష్టాలు తెలుసుకుని బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడలో 1000 గజాల స్థలాన్ని నియోజకవర్గంలోని బ్రాహ్మణులకు కేటాయించిన మంత్రి సబితారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం బడంగ్‌పేట బ్రాహ్మణ సేవాసమితి, శ్రీవాణిగాయత్రీ సేవా ట్రస్ట్ సభ్యులు బడంగ్‌పేటలో మాట్లాడారు. బ్రాహ్మణ పక్షపాతి అయిన సీఎం కేసీఆర్, మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతో కోట్ల విలువైన స్థలం బ్రాహ్మణులకు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. బ్రాహ్మణులం అందరం కలిసికట్టుగా బీఆర్‌ఎస్ పార్టీకి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, శ్రీవాణీగాయత్రి సేవా ట్రస్ట్ చైర్మన్ రామాశంకర్, ఉపాధ్యక్షులు మూర్తి, శ్రీరామ్ శర్మ, ప్రసాద్, మోహన్, కామేశ్వర్‌రావు, మహిళా కమిటీ సభ్యులు విజయ, సుగుణ, జ్యోతి, శైలజ, మాధవి, సాయి, అనూష, పద్మజ, మధిర, పద్మజ, యూత్ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి

కందుకూరు: కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి కోరారు. మంగళవారం మండల పరిధిలోని గూడూరు, మురళీనగర్‌లో ఎంపీపీ మంద జ్యోతిపాండు, స్థానిక సర్పంచ్‌లు పి.శ్రీలతశ్రీహరి, సోమ్లానాయక్‌తో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఎస్.ఎల్లారెడ్డి, లలితకుమార్, వార్డు సభ్యులు ఆంజనేయులు, రామకృష్ణ, రంగమ్మ, కవిత, లక్ష్మమ్మ, కోర్పి సురేందర్, పాపిరెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిర్ర సాయిలు, మైనార్టీ మండల అధ్యక్షుడు మహ్మద్ అలీ, నాయకులు పాండుగౌడ్, బర్కం వెంకటేష్, ప్రకాష్‌రెడ్డి, హనుమంతుయాదవ్, నరసింహాయాదవ్, షకీల్, నరసింహారెడ్డి, కాకి నరసింహాముదిరాజ్, జైపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జానీమియా పాల్గొన్నారు.



కందుకూరు: కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న జంగారెడ్డి

మంఖాల్ గ్రామంలో..

తుక్కుగూడ: కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ బూడిద తేజస్విని సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధుమోహన్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, డాక్టర్ రాజుకుమార్, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాసబ్ చెరువు రీసర్వే చేపట్టాలి



మాసబ్ చెరువు వద్ద ధర్నా చేపడుతున్న నాయకులు

చెరువు వద్ద అఖిలపక్షం నాయకుల ధర్నా

తుర్కయంజాల్: మాసబ్ చెరువును వెంటనే రీ సర్వే చేపట్టి చెరువులో డంప్ చేస్తున్న మట్టిని తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అఖిలపక్ష నాయకులు, చెరువు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చెరువు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ.. కోర్టు ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని కొందరు వ్యక్తులు యథేచ్ఛగా రాత్రివేళల్లో మట్టిని డంప్ చేస్తున్నారని, వారసత్వ సంపదగా వస్తున్నటువంటి చెరువును కళ్లముందే అన్యాక్రాంతం చేస్తుండటం బాధాకరమైన విషయం అని అన్నారు. మూడేళ్ల క్రితం వరకు సరైన వర్షాలు కురవకపోవడంతో నీరు తక్కువ మొత్తంలో ఉండేదని, వరుసగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువు నిండి పూర్వవైభవాన్ని సంతరించుకుందని అన్నారు. భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకుని చెరువు పరిరక్షణ కొరకు ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే చెరువులో మట్టిని డంప్ చేస్తున్నారని అన్నారు. స్థానిక అధికారులు స్పందించకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కళ్యాణ్ నాయక్, కాంగ్రెస్‌పార్టీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షురాలు కౌన్సిలర్ మంగమ్మ, కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, సునీల్, మల్లేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాంచందర్, బీజేపీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్త అశోక్ గౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రమేష్, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయరూ..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రకుంట చౌరస్తాలో రహదారి గోతులమయంగా మారినా అధికారులకు పట్టడం లేదు. ఎగువన మోరీ నుంచి మురుగునీరు రోడ్డుపై పారడంతో 10 మీటర్ల మేర రోడ్డు శిథిలమైంది. రోజులు గడుస్తున్నా రహదారిని పట్టించుకోని కారణంగా కొందరు స్థానికులు గృహ నిర్మాణ వ్యర్థాలను గోతుల్లో నింపారు. తాజాగా మురుగు పారుతుండటంతో గోతులు మరింత పెద్దవై వాహనాల రాకపోకలకు అసౌకర్యం కలుగుతోంది. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.



ఎర్రకుంట రోడ్డుపై గుంతలు

బీఆర్‌ఎస్‌తోనే తండాల అభివృద్ధి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్

మహేశ్వరం: నాగారం-పడమటి తండా బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలే తెలియజేస్తున్నామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగారం-పడమటి తండాల్లో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన రోడ్డును పరిశీలించారు. గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్, తెలంగాణ ప్రభుత్వానికే చెందుతుందన్నారు. మండలంలోని ప్రతి గిరిజన తండాకు మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారన్నారు. నాగారం మాజీ సర్పంచ్ రాములునాయక్, నాగారం ఉపసర్పంచ్ లతీఫ్ ఖాన్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు లింగం ముదిరాజ్, లింగ్యానాయక్, దేవులనాయక్, శివగౌడ్ పలువురు పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న రాజునాయక్

230 మందికి వైద్య పరీక్షలు

కందుకూరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దావూద్‌గూడతండా సర్పంచ్ విజయరాజునాయక్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని దావూద్‌గూడతండాలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరంలో కామినేని ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రాధిక, డాక్టర్ తేజ, డాక్టర్ మౌనిక 230 మందిని పరీక్షించి అవసరమున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు రాజమ్మతార్యానాయక్, ఉపసర్పంచ్ కుమారిధన్‌సింగ్, నిర్వాహకులు దేవేందర్, వెంకన్న, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి



లేఖను చూపుతున్న సుమన్‌గౌడ్

పహాడీషరీఫ్: నిరుద్యోగుల జీవితాలను దృష్టిలో ఉంచుకొని టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని వైఎస్సార్ టీపీ యువజన విభాగం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జీ సుమన్ గౌడ్ కోరారు. పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల పిలుపు మేరకు మంగళవారం ఆయన టీ-సేవ్ ఉద్యమంలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు లేఖ రాశారు. ఆ లేఖను రిజిస్టర్ పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి పోటీ పరీక్షలకు సిద్ధమైన నిరుద్యోగుల జీవితాలతో టీఎస్‌పీఎస్సీ అధికారులు చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. పేపర్ లీకేజీ ఘటన పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు.

పీపుల్స్ మార్చ్‌లో మన నేతలు



భట్టితో కలిసి పాదయాత్ర చేస్తున్న నాయకులు

కందుకూరు: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, నాయకులు మదన్‌పాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు గాయత్రీనగర్ నుంచి బడంగ్‌పేట వరకు చేపట్టిన పాదయాత్రలో వారు పాల్గొన్నారు.

9నెలలుగా హిజ్రాతో సహజీవనం

కాదు పొమ్మన్నందుకు యువకుడి ఆత్మహత్య

పహాడీషరీఫ్: తనతో సహజీవనం చేస్తున్న హిజ్రా...తనను వదిలి వెళ్లిపోవాలని అన్నందుకు మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్‌పోలీస్‌స్టేషన్‌పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇదిలా ఉండగా తమ కుమారుడిది ముమ్మాటికి హత్యేనంటూ మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్‌కాశీ విశ్వనాథ్‌తెలిపిన వివరాల ప్రకారం ... యూసుఫ్‌గర్‌ప్రాంతానికి చెందిన మొహమ్మద్‌అన్వర్ పెద్దకుమారుడు మహ్మద్ అజహర్(23) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. జల్‌పల్లికి చెందిన హిజ్రా సోఫియా బకాష్(25)తో 9 నెలలుగా లైంగిక సంబంధం కొనసాగిస్తున్నాడు. హిజ్రా సోఫియా బకాష్‌జల్‌పల్లిలో నాలుగు రోజుల క్రితం ఓగది అద్దెకు తీసుకుంది. దీంతో ఈనెల 8న అజహర్ హిజ్రా సోఫియా ఇంటికి వచ్చాడు. రాత్రి 10గంటలకు వారిద్దరు కలిసి ఆటోలో బయటికి వెళ్లారు. 9వ తేదీన తెల్లవారుజామున 4.30గంటలకు తిరిగి ఇంటికి చేరుకున్నారు. దీంతో అప్పటివరకు బాగానే ఉన్న హిజ్రా సోఫియా ఇక నువ్వు ఇంటికి వెళ్లిపోవాలని అజహర్‌పై కోప్పడింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అజహర్‌ఆమె ఉండే గదిలోకి వెళ్లి డోర్‌పెట్టుకున్నాడు. 10 నిమిషాల వరకు అజహర్‌బయటికి రాకపోవడంతో కిటికీలోంచి చూ డగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నాడు. తలుపులు బద్దలు కొట్టి చూడగా అప్పటికే అజహర్‌మృతిచెందాడు. మృతుడి తండ్రి అన్వర్ ఫిర్యాదు మేరకు పహాడీషరీఫ్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనాథ విద్యార్థి గృహానికి విరాళం

దిల్‌సుఖ్‌నగర్: బంజారాహిల్స్‌లోని స్నేహా సేవా సంస్థ తరపున అధ్యక్షుడు సుబ్బారెడ్డి ఆర్‌కేపురం డివిజన్‌లోని అనాథ విద్యార్థి గృహం విద్యార్థులకు జూన్ నెల రేషన్ కోసం రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, అనాథ విద్యార్థి గృహం రెండు తెలుగు రాష్ట్రాల అనాథ నిరుపేద విద్యార్థులకు భోజన , వసతి, విద్యా సౌకర్యాలు కల్పించి వారి బంగారు భవిష్యత్‌కు కృషి చేస్తున్నదని అభినందించారు. స్నేహా సేవా సంస్థ గత పదేళ్లుగా అనాథ విద్యార్థి గృహానికి నెల రేషన్ సరుకులకు అవసరమైన డబ్బులు సమకూరుస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా స్నేహ సేవా సంస్థకు గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపాడు.



రూ.50 వేల చెక్కును అందజేస్తున్న సుబ్బారెడ్డి

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- ముద్వీన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కడ్తాల్: రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముద్వీన్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, అదే విధంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు ద్వారా పంట పెట్టుబడి సాయం, ప్రమాద బీమా, సకాలంలో ఎరువులు, విత్తనాలు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

మినీ వాటర్ ప్లాంట్ ప్రారంభం..

మండల పరిధిలోని న్యామతాపూర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గ్రామంలో సర్పంచ్ రవీందర్‌రెడ్డితో కలిసి మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే, కడ్తాల్-షాద్‌నగర్ రోడ్డు నుండి మక్తమాధారం వేణుగోపాల స్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి రూ.10 లక్షల ప్రొసీడింగ్‌ను సర్పంచ్ సులోచన సాయిలు, ఎంపీటీసీ మంజుల చంద్రమౌళికి అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఎఓ శ్రీలత, ఏడీ శ్రీనివాస్, ఏఈ నరేందర్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, సులోచన, యాదయ్య, సుగుణ, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, మంజుల, ఉప సర్పంచ్‌లు వినోద్, బండి గణేశ్, నాయకులు రాజేందర్‌యాదవ్, జంగయ్య, మహేశ్, సేవ్యా, పాండు, మహేందర్‌గౌడ్, రాజు నాయక్, శ్రీనుగౌడ్, ఏఈవో అభిలాష్, పీఏసీఎస్ సిబ్బంది దేవేందర్, పద్మాకర్ తదితరులు ఉన్నారు.

మిల్లర్లు సహకరించాలి..

ఆమనగల్లు: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సూచించారు. వరిధాన్యం కొనుగోలు విషయంలో రైస్‌మిల్లర్లు సహకరించాలని ఆయన కోరారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెకంటేశ్‌గుప్త, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, తహసీల్దార్ జ్యోతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యం, సీఈఓ దేవేందర్, రైస్‌మిల్లర్లు కరుణాకర్, యాదయ్య, విష్ణువర్ధన్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆమనగల్లులో ధోబీఘాట్ల నిర్మాణానికి రూ.కోటి మంజూరుకాగా దీనికి సంబంధించిన ఉత్తర్వుల కాపీలను ఎమ్మెల్యే.. రజక సంఘం నాయకులకు అందించారు.



ఆమనగల్లు: ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్